నిధులు మంజూరు చేయండి

ఉప్పల్, మార్చి 12 : నియోజక వర్గంలోని అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులు సత్వరం పూర్తిచేసేలా చూడాలని కోరారు. అసంపూర్తి పనులను పూర్తిచేసేలా చూడాలని, అవసరమైన వాటికి నిధులు మంజూరు చేయాలన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ నిధులు మం జూరు కోసం అధికారులకు ఆదేశించారని

నిధులు మంజూరుపై హర్షం

ఉప్పల్, మార్చి 12: నియోజక వర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి నిధుల కేటాయింపులను హర్షిస్తూ మంగళవారం ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ రహదారిలో నీటినిల్వల సమస్య పరిష్కారానికి రూ.2.30 కోట్లు, తదితర పనుల కోసం నిధులు తీసుకువచ్చామన్నారు. కార్యక్రమం లో కార్పొరేటర్ రజితా రెడ్డి, నాయకులు గిరిబాబు, తౌఫిక్, రామకృష్ణ, లక్ష్మణ్, రఘుపతిరెడ్డి, జగన్నాథ్, అమరేశ్వరీ, రఫీక్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డ్రైనేజీతో..

అవస్థలు

దర్గా ఖలీజ్‌ఖాన్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు

- సర్వీసు రోడ్డులో ప్రయాణించాలంటేనే జంకు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- సమస్య మా దృష్టికి రాలేదు: యాదయ్య, డీఈఈ

సర్వీస్ రోడ్డు వెంట ప్రవహిస్తున్న మురుగు

బండ్లగూడ, మార్చి 12: ఓపెన్ డ్రైనేజీతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ఆయా రోడ్ల వెంట ప్రయాణించాలంటే ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి దాపురించింది. డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గా ఖలీజ్‌ఖాన్ వద్ద ఉన్న సర్వీస్ రోడ్డు వెంట డ్రైనేజీ పైపులలైన్ల నిర్మాణం లేకపోవడంతో మురుగు నీరు రోడ్డు పక్కనే నిల్వకుండిపోయింది. అంతేగాకుండా చెత్తాచెదారం పేరుకుపోయింది. ఓపెన్ డ్రైనేజీలతో దర్గా ఖలీజ్‌ఖాన్ గ్రామ ప్రజలు నిత్యం దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. అంతేకాకుండా సర్వీస్ రోడ్డు వెంట రాకపోకలు కొనసాగించే వాహనదారులు సైతం ముక్కున ముసుకుని ప్రయాణించాల్సి వస్తుందని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిల్వ ఉండటం ద్వారా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే అధికారులు స్పందిచి తగిన చర్యలు తీసుకుని డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దర్గాఖలీజ్ ఖాన్ వద్ద సర్వీస్ రోడ్ వెంట ప్రవహిస్తున్న మురుగు

సమస్య మా దృష్టికి రాలేదు: యాదయ్య, డీఈఈ

దర్గా ఖలీజ్‌ఖాన్ గ్రామంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్య మా దృష్టికి రాలేదు. గ్రామంలో పర్యటించి, సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం అని ఆయన తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు: ఇనాయత్, దర్గాఖలీజ్‌ఖాన్ వాసి

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో వారి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. దర్గాఖలీజ్‌ఖాన్‌లోని డ్రైనేజీ సమస్య గురించి గతంలో అధికారులకు ఫిర్యాదులు చేశాము. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిరోజు మురుగువాసనతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

శిలాఫలకంపై దాతల పేర్లు పెడితే తప్పేంటి..

కందుకూరు, మార్చి 12: శ్మశాన వాటికను విశాలంగా నిర్మించినట్లు కొత్తగూడ మాజీ సర్పంచ్ సాద మల్లారెడ్డి తెలిపారు. కావాలని కొంత మంది రాజకీయం చేస్తున్నారని.. శిలాఫలకంపై దాతల పేర్లు పెడితే తప్పేంటని ప్రశ్నించారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. శ్మశాన వాటిక నిర్మాణానికి ప్రభుత్వం రూ.12.60లక్షలు మంజూరు చేసిందని.. అంతకు రెట్టింపు నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో రాళ్లు ఉండటంతో చదను చేయడానికి రూ.5.50లక్షలు ఖర్చు అయినట్లు వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు పంచాయతీ నుంచి తీసుకున్న నిధుల కన్న రెట్టింపు ఖర్చు కావడంతో తాను సొంతంగా డబ్బులు పెట్టి తాత, నాయనమ్మ ఎల్లారెడ్డి, వెంకటమ్మ పేర్లను శిలాఫలకంపై పెట్టినట్లు వివరించారు. దాతల పేర్లు పెట్టడం తప్పా అని ప్రశ్నించారు. దీనిని కొంత మంది రాజకీయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్మశాన వాటికలో విశాలమైన గదులు, విశ్రాంతి గదితో వసుల కల్పించినట్లు చెప్పారు. తన వద్ద పూర్తి సమాచారం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల బాలేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాద మల్లారెడ్డి

బండ్లగూడలోని జీఎస్ఐలో ఆలిండియా జియోలాజికల్ సర్వే ఇండియన్ షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌథర్న్ రీజియన్ త్రైమాసిక సమావేశానికి హాజరైన జీఎస్ఐ ఏడీజీ, హెచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

జీఎస్ఐలోని అన్ని కేడర్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్నాం

- జీఎస్ఐ ఏడీజీ, హోచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావు

మన్సూరాబాద్, మార్చి 12: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలోని అన్ని కేడర్లలో సకాలంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు జీఎస్ఐ ఏడీజీ, హెచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలిండియా జియోలాజికల్ సర్వే ఇండియన్ షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌథర్న్ రీజియన్ త్రైమాసిక సమావేశంలో మంగళవారం ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎస్ఐ ఏడీజీ, హెచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావును ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదార్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీహెచ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం జీఎస్ఐలో రిజర్వేషన్ రోస్టర్ కార్యకలాపాల అనుసారం ఒక పోస్ట్ నుంచి ఉన్నత స్థాయి పోస్ట్‌కు పదోన్నతి పొందే సమయంలో కచ్చితంగా నిబంధలనలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రిజర్వేషన్ల నిబంధనల ఉల్లంఘనలు జరగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐలోని వివిధ విభాగాల డైరెక్టర్లు హర్మోహన్ మిశ్రా, అనూప్ ఎన్ కాంబ్లే, అసిస్టెంట్ డైరెక్టర్ కె. రాజగోపాల్, అసోసియేషన్ సభ్యులు కబిరాజ్ సేఠి, బి.లింగ్యా, బి.శ్రీనివాసరావు, జె.రాజశేఖర్, కిశోర్‌కుమార్, ఎం.చక్రేశ్వర్, ఏ.మేఘరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనల వైపు అడుగుపెట్టాలి

హయత్‌నగర్, మార్చి 12: విద్యార్థులు చదువుతోపాటు శాస్త్రీయ, సాంకేతికత వైపు ఆలోచనలు చేయాలని శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మన్ జి.రాధాకృష్ణ సూచించారు. మంగళవారం హయత్‌నగర్‌లోని శాంతినికేతన్ టాలెంట్ హైస్కూల్‌లో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మన్ జి.రాధాకృష్ణ హాజరై మాట్లాడుతూ.. సైన్స్ ఎగ్జిబిషన్ల ద్వారా విద్యార్థుల్లో దాగిన ప్రతిభ వెల్లడవుతుందని, విజ్ఞాన ప్రదర్శనలు వారిలో నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత పెంచుతాయని వివరించారు. విద్యా సంస్థల డైరెక్టర్ జి.ఝాన్సీరాధాకృష్ణ, జి.సాహితి, డీన్ బి.ఫణిశ్రీ ప్రభుంజనీ, వైస్ ప్రిన్సిపాల్ బి.ఉపేందర్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినికేతన్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ జి.రాధాకృష్ణ, ఉపాధ్యాయుల బృందం

పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించాలి

హయత్‌నగర్, మార్చి 12: పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం అన్మగల్ హయత్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికులు విధులను సక్రమంగా నిర్వహించాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు గంగని శ్రీను, ఎర్రవెల్లి సత్యనారాయణ, బస్తీవాసులు తదితరులు ఉన్నారు.

అన్మగల్ హయత్‌నగర్‌లో కార్మికులతో చర్చిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల చేయూత

మన్సూరాబాద్, మార్చి 12: పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూతనిచ్చింది. ఎల్బీనగర్‌కు చెందిన మంజుల వివాహం ఇటీవల నిశ్చయమైంది. మంజుల కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కొందరు సన్నిహితులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంజుల వివాహానికి గాను పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, కటకం శ్రీనివాస్, నరేశ్‌గుప్తా, చింతల రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గుమ్మడవెల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోతి, జడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు, మార్చి 12: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ మంద జ్యోతి పాండు, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. గుమ్మడవెల్లి గ్రామంలో రూ.33లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు బాబురావు, గుయ్యని సామయ్య, మంద పాండు, మాజీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి

కందుకూరు, మార్చి 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, విద్యుత్ వంటి హామీలను ఇప్పటికే నెరవేర్చినట్లు తెలిపారు. అంతే కాకుండా ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. ఈనెల 15వ తేదీ వరకు ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పొడిగించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ అనంతరం రైతుల ధరణి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ ఎండీ అజ్జల్ బేగ్, నాయకులు అందుగుల సత్యనారాయణ, సొడపు వెంకటేశ్‌గౌడ్, గుండ్ర సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జగదీశ్వర్, వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

మేయర్‌ను సత్కరించిన అధికారులు..

బడంగ్‌పేట, మార్చి 12: అవిశ్వాసం వీగిపోయి మరోసారి మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్‌ను మంగళవారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్వో అంజన్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి దేవానంద్, కార్పొరేటర్ ముద్ద పవన్ కుమార్, పి.సత్యనారాయణ శాలువాతో సత్కరించి మిఠాయిలను తినిపించారు.

మన్సూరాబాద్‌లో పర్యటించిన ఈటల

మన్సూరాబాద్, మార్చి 12: దేశం సురక్షితంగా ఉండాలంటే మోదీ ప్రధానమంత్రి కావాలని మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. సహారాస్టేట్స్‌కాలనీ, మన్సూరాబాద్ పెద్ద చెరువు తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 12: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి కాటేదాన్ శివాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మద్యం మత్తులో రోడ్డుపక్కన పడుకోగా గుర్తుతెలియని వాహనం అతడిపై వెళ్లింది. రెండు కాళ్లు విరిగి అధిక రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కదిలిన యంత్రాంగం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఎల్బీనగర్, మార్చి 12: నిధులు మంజూరైనా పనులు చేయకుండా తాత్సరం చేస్తున్న అధికారుల తీరుపై నమస్తే తెలంగాణ పత్రికలో రాసిన కథనంతో జలమండలి అధికారులు స్పందించారు. పాత డ్రైనేజీ స్థానంలో నూతన పైపులైన్ వేసేందుకు శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగా డ్రైనేజీ పైపులు తెప్పించారు. ఒకటి, రెండు రోజుల్లో పైపులైన్ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీ రోడ్ నంబర్ 3లో గతంలో వేసిన డ్రైనేజీ పైపులైన్ పెరిగిన జనాభా, జనవాసాలకు సరిపోకపోవడంతో తరచుగా మురుగునీరు పొంగిపొర్లి రోడ్లపై ప్రవహిస్తూ స్థానికులకు ఇబ్బందిగా మారింది. ఈ పనులు దాదాపుగా సంవత్సరాల తరబడి ఇబ్బందిగా మారింది. ఈ పనులపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పనులు చేసేందుకు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంతో మాత్రం తాత్సరం చేస్తున్నారు.

మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీ రోడ్ నంబర్ 3లో వేసేందుకు తెచ్చిన డ్రైనేజీ పైపులు

ఈ విషయంపై నమస్తే తెలంగాన దినపత్రికలో మార్చి 1వ తేదీన ప్రచురితమైన వార్త కథనంతో అధికారులు స్పందించారు. ఈ రోడ్డుపై పైపులైన్ నూతనంగా మార్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు రోడ్ నంబర్ 3లో నూతనంగా వేసేందుకు నూతన డ్రైనేజీ పైపులను డంప్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ మేరకు తమ డ్రైనేజీ సమస్యలు పరిష్కారం చేస్తున్నందుకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్య గౌడ్, కార్యవర్గసభ్యుడు సత్యనారాయణలు హర్షం వ్యక్తం చేశారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

సైదాబాద్, మార్చి 12 : షహీద్ భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 18,19,20 తేదీల్లో మూడు రోజులపాటు ఏఐవైఏఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యువతకు జరిగే క్రికెట్ టోర్నమెంట్ పోటీల గోడ పత్రికను మంగళవారం హైదరాబాద్ జిల్లా ఏఐవైఏఫ్ అధ్యక్షుడు షేక్ మహమూద్ ఆవిష్కరించారు. క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజయం సాధించిన విజేతలకు భగత్‌సింగ్ జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్ నాయక్, గోపాల్ నాయక్, మత్రు, హరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

మలక్‌పేట, మార్చి 12: మహిళా సాధికారతకు కృషి చేయాలని హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత సూచించారు. శాలివాహన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు స్వయం సమృద్ధిని సాధించేందుకు కృషి చేయాలని.. మహిళా సాధికారతతోనే కుటుంబాలు, సమాజం, దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. నేడు అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ అనేకచోట్ల పురుషాధిపత్యం కనిపిస్తుందన్నారు. అనంతరం మూసారాంబాగ్ కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. ఈ సందర్భంగా బిందు హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ హిమబిందును పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి కమలాకర్, కోశాధికారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఆర్కేపురం, మార్చి 12: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పున్న నిర్మల గణేశ్ జన్మదినం సందర్భంగా డివిజన్‌లోని పార్టీ కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి మధుసూదన్‌రావు, తలాటి రమేశ్‌నేత, నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్, జెల్లా జగన్నాథం, గడ్డం లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, మహేందర్, సాయి, బండిగోపాలరావు, సంగం రమేశ్, దోర్నాల చంద్రమౌళి, సందీప్, నాగేశ్వర్‌రావు, రేణుక, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, పున్న నిర్మల గణేశ్

ఎమ్మెల్యేకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు..

బడంగ్‌పేట, మార్చి 12: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనిలయ కాలనీకి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మణెమ్మ, పద్మ, శివానీరెడ్డి, తదితరులు మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి నివాసానికి వెళ్లి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఏడాదైనా ప్రారంభం కాని రోడ్డు పనులు

కుర్మగూడలో గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు ఏఈ అన్సారీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్

మాదన్నపేట, మార్చి 12: కుర్మగూడ డివిజన్ పరిధిలో రోడ్లు గుంతలమయంగా మారిపోయాయి. వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఏడాది కిందట రోడ్డు పనులకు జీహెచ్ఎంసీ బిల్ సాంక్షన్ చేసినప్పటికీ ఇప్పటి వరకు అధికారులు రోడ్డు పనులు చేపట్టలేదని మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ అధికారులపై మండిపడ్డారు. మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ అన్సారీ, విక్రమ్ నాయకులు మోహన్ లడ్డు తదితరులు పాల్గొన్నారు.